

-ప్రమీలా కుమారి

కాకినాడ,
27—3—63

నా మనసులోని పూర్ణిమవెన్నెల నీకు!

నీ ఉత్తరం ఇప్పుడే అందింది. నిన్ను తిరిగి చూస్తున్నట్లనిపించింది. ఉద్యోగంలో చేరి నాలుగు రోజు లయింది. మనసంతా బరువుగా ఉండేది — ఎందుకో! నీ ఉత్తరం

చూడగానే మనసంతా తేలిగ్గా దూది పింజలా అయిపోయింది. ఉగాదిపండుగ బాగానే నడిచింది. నీ శుభా కాంక్ష అందుకున్నాను. ఆవేళ వరండాలో కూర్చుని నీ గురించే ఆలోచిస్తున్నాను. ఇంతలో "మల్లెపూలు,మల్లెపూలోయ్!" అంటూ కేక వినిపించింది. ఒక్కసారి సిగ్గుల మొగ్గలు తొడిగిన నీ బుగ్గలు జ్ఞాపకం వచ్చాయి. వెంటనే పిలిపించా వా పువ్వు లబ్బాయిని. ఒక డజను గులాబీలు, రెండు వందల మల్లెపూలు కొన్నాను. మనసా నీ రూపమే అనుకున్నాను. చేతినిండా పూలతో దేవుని పటం దగ్గరకు చేరుకున్నాను. హృదయంలోనే నా దేవి కంఠం విన్నాను. ఆ శివ పార్వతులను పూజించుకున్నాను.

మనస్సు తృప్తిగా ఉంది. ధవళ కాంతిలో మెరిసే మల్లెలు దేవుడిచ్చిన వరాల్లా కనిపించాయి. నీ నవ్వే నాకు లభించిన వరప్రసాదం. అనుక్షణం గుర్తుకొస్తున్నావోయ్, వీణా! అప్పుడే.. నిన్ను ... చూడాలనీ... ఏవో తియ్యని ఆలోచనలు నన్ను ముసురుకుంటున్నాయి. గులాబీల కన్నా మృదువయిన నీ హృదయాన్ని వేటితో పూజించనూ?

ఇక ఉండనా అందాల గారాలబాలా?
మళ్లీ రేపు కలుద్దాం.
సదా నీ కళ్లల్లోని వెలుగు
—నీ భానూ.

గుడివాడ,
30—3—63.

నా నాయుడు బావా!

తెలవారే నీ లేఖ అందుకున్నాను. ఆనందంలో ఓలలాడాను. ఈ నిశా సమయం నా కెంతో హాయిగా ఉంది. చల్లటి గాలి వీస్తోంది. నువ్వు నిద్రపోతున్నావో, కుర్చీలో కూర్చుని పత్రిక చదువుతున్నావో, ఏ రోడ్ల మీద తిరుగుతున్నావో అని ఆలోచిస్తూ కాగితం కలం తీసి వ్రాస్తున్నాను. నాకు నీ ఉత్తరాలతో కాలం ఆనందంగా గడిచిపోతూంది. రాత్రి, మత్తెక్కించే నైట్ క్వీన్ సువాసనల్లో, ఆలోచనల తరంగాల్లో, ఊహల ఉయ్యాలల్లో ఊగుతూ దోమతెరలో పడుకుని ఏవో యోచిస్తున్నాను. ఆ ఆలోచన లన్నీ నీ గురించే! ఎప్పుడు నిద్ర ఆవరిస్తుందో నాకే తెలియదు. నిదుర నిండా కలలు. ఆ కలల్లో నీ రూపమే!

నేనే ఇప్పుడు నీ దగ్గరుంటే ఏం చేసేదాన్నో తెలుసా? తెల్లటి పక్కవేసి, చల్లటి మనసుతో, తీయటి పూల వానల్లో నా ఒడిలో నిన్ను నిద్రపుచ్చి ఉండేదాన్ని. రాత్రి వ్రాస్తున్నాను కాబట్టి ఇప్పటికి గుడ్‌నైట్! తీయని తలపులతో ... కమ్మని కలల కౌగిలిలో ... చల్లని గాలుల ... గుసగుసలలో ... మెత్తని తెల్లని పానుపుపై ... హాయిగా నిదురపో!

ప్రేమతో ... ఇంకాఏమేమోతో..
నీ ప్రణయిని
—వీణ.

కాకినాడ,
4—12—63.

నా తియ్యని హృదయమా! వీణా!

అనేక ... శుభాశీస్సులు. కులాసాగా ఉన్నాను. నువ్వా కులాసాయే(నా?) అని నే నడగక్కర్లేదుగా? నాకు తెలుసూ! అదిగో అద్దంచూస్తూనే నవ్వుల పువ్వులొలికిస్తున్నావ్. అదిగో, నాకు కనిపిస్తూనే ఉందిలే ఆ పారించిన పూల విల్లు. బహుశా నీ చిరునవ్వుల కాంతులలతో నీ పరిసరమంతా పువ్వులు రువ్వుతూ ఉంటుంది. హాయ్! హాయ్! కవ్విస్తుండే ఆ పువ్వుల వానలో నవ్విస్తున్న నీ నగుమోముచూస్తూ, నవ్విస్తున్న ఆ... అవన్నీ తలుచుకుంటూంటే ... 'నీ కెట్టుందోగాని పిల్లా, నాకు భలేగా ఉందిలే!'

ఈ హుషారంతా ఎందుకో మనవి చేసుకోనా దేవికి? ఈ వేళే మామయ్య అంటే మీ నాన్న దగ్గర నుండి ఉత్తరం వచ్చింది. ఈ వైశాఖంలో ముహూర్తం పెట్టడానికి నా అంగీకారం తెలుపమని వ్రాశారు. వైశాఖం దాకా ఎందుకూ? ఇంకాస్త ముందుగా ఏవైనా ముహూర్తాలుంటే చూడమని వ్రాసేద్దామా అని ఉంది.

ఈ రోజు నా మనసు రెక్కలు విప్పుకొని గగన పథాన విహరిస్తోంది. ఆ ఊహల్లో ఎన్నో మధురదృశ్యాలు. ఒక చక్కని పూలతోట ... ఆ తోట మధ్య నుండి నేను పిల్లనగ్రోవి ఊదుకుంటూ ... పోతున్నట్టూ — అంతలో హఠాత్తుగా వెనకనుండి, పూల మధ్యలో పుట్టిన పూల రాణిలా వచ్చిన యెంకి "బావా!" అంటూ వచ్చి నన్ను చుట్టేసినట్టూ — కొంతసేపు చూపుల్లోనే ఒకరిలో ఒకరం కరిగిపోతున్నట్టూ ... ఉన్నట్టుండి ఒక్కసారి గలగలా పారే సెలయేటి ప్రవాహంలా, భళ్ళున నవ్వుకుంటూ ... చేయీ చేయీ కలిపి ... ఊపుకుంటూ ... అనురాగంలో మునిగిపోతూ ... రాగాలు తీసుకుంటూ .... నడుస్తూనడుస్తూ పడుతూ ... లేస్తూ ... అలా కను చూపుమేర దాటే వరకూ పోయి పోయి — అలా గగనతలంలో మాయమయ్యామట!

ఏమిటో ... కలం దాని ఇష్టం వచ్చినట్టు పరిగెడుతూంది. సెలవు పెట్టి రెండు రోజుల్లో బయలుదేరి వస్తాను. రాణి గారు ఎలా స్వాగతమిస్తారో చూస్తానుగా ...

నీ నవ్వుల్లో తియ్యని
—నీ భానూ.

## వృత్తి

ప్రకృతి వృత్తిని మనకు అవసరంగాను, సంఘం దానిని విధిగాను మనకు ప్రసాదించినవి; అలవాటు దానిని ఆనందదాయకంగా చేస్తుంది.

—కెపెల్

గుడివాడ,
20—5—64.

బావా! నా సర్వస్వమా!

వ్రాస్తుంటే చేయి వణుకుతూంది. అనిర్వచనీయమైన ఉద్వేగం నా ఎడదంతా ఆవరించుకుంది. ఇన్నాళ్ళూ ఒక ఎత్తుగా గడిచింది. ఇప్పుడేదో చెప్పలేని మధుర భావానుభూతి నన్ను తియ్యని వెల్లువలో ముంచెత్తుతూంది. మెడలోని మాంగల్యం గుస గుసలతో ఏవో రహస్యాలు చెబుతూ నన్ను లజ్జితురాల్ని చేస్తూంది. ఈ వియోగం భరించలేనిదిగా ఉంది.

నాకు వచ్చేయాలని ఉంది. ఏ రాత్రప్పుడయినా వచ్చి నన్ను తీసుకుపో. రెక్కలు కట్టుకుందాం. మేఘాల్లో తేలిపోదాం. తేలి ... తేలి ... సముద్రపు టొడ్డున వాలిపోదాం. జలకాలాడుదాం. ఆ అలల ఉయ్యాలల్లో ఊగుదాం.

నువ్వు సముద్రపు టొడ్డున ఇసుకలో పడుకుని ఆలోచిస్తూంటా వనుకో. అప్పుడు ఒక పువ్వు వచ్చి నీ పక్కన వాలుతుంది. దాన్ని నువ్వు స్పృశించేసరికి నీ వీణగా మారిపోతుంది. నీలో ఇమిడి పోతుంది.

ఏమిటోలే! అన్నీ ఊహలే! ఈ ఊహల్లో ఎన్నాళ్ళు తృప్తిపడటం? మన పాలిట ఆషాఢమాసం ఒకటి వస్తూంది. ఇంకొద్దులే. తలుచుకుంటే ఏడుపు కూడా వస్తూంది.

నీ ఉత్తరంకోసం వేయికళ్లతో నిరీక్షిస్తుంటాను.

నీ హృదయవీణ.

కాకినాడ,
11—12—64.

ప్రియ వీణా!

నువ్వు వెళ్లి అప్పుడే నాలుగు రోజు లయింది. నా ప్రాణానికి నాలుగు యుగాలుగా ఉంది. నీ అమృత హస్తానికి అలవాటు పడ్డ ప్రాణానికి హోటలు భోజనం చేదు విషంలా ఉంది. వియోగంలో ప్రేమ మరింత వృద్ధి అవుతుందన్న మాటలోని నిజం నా కిప్పుడిప్పుడే అనుభవమవుతూంది. భార్యాభర్తల మధ్య విరహాన్నీ, తద్వారా అనురాగాన్నీ రగల్చడానికే ఈ ఆషాఢ తగువులు, పురిటికి పుట్టింటికి తీసుకెళ్ళడాలూ పెట్టారేమో పెద్దలు! కానీ అనుభవించడం మాత్రం బాధాకరంగానే ఉంది సుమా!

ఇన్నాళ్ళూ ఒంటరి పక్షిని. నీ రాకతో జంటపక్షుల మయ్యాము. నా గూటిలోకి వెలుగును తెచ్చావు. ఇంకో నాలుగు నెలల్లో ఇంకో బుల్లి పిట్ట మన ఇద్దరి మధ్యకు వస్తుందని, తన కువకువలు వినిపిస్తుందనీ తలుచుకుంటూ ఉంటే కొత్తగా ఉంది. ఒళ్ళు పులకరిస్తూంది. నీ ఆరోగ్యం జాగ్రత్త సుమా! నువ్వెంత ఆరోగ్యంగా ఉంటే పుట్టబోయే బాబు అంత ఆరోగ్యంగా ఉంటాడు. నీవు ఇక్కడున్నట్టే రోజూ ఉత్తరాలు వ్రాయాలి. నిరీక్షిస్తూంటాను.

ప్రేమతో
—నీ భానూ.

గుడివాడ,
8—4—65.

శ్రీవారికి,

మా నాన్న ఇచ్చిన టెలిగ్రాం అందుకునే ఉంటారు. మీరే గెలిచారు. మీ కోరిక ప్రకారం బాబే పుట్టాడు. అంతా మీ పోలికే నంటున్నారు అందరూ. పెళ్ళయి ఏడాదన్నా నిండకుండానే నన్ను అమ్మను చేసిన ఆ చిన్నారి రూపాన్ని చూస్తూంటే నేను ఆకలి దప్పులు మరిచిపోతున్నాను. మీరు వెంటనే వస్తే బావుండేది కానీ, బాబుకి ఏదో శాంతి చేయించాలట. అప్పటిదాకా మీరు చూడకూడదంటున్నారు. బారసాల గొప్పగా చేయించాలని అమ్మ కలలు కంటూంది. బాబుకి మంచిపేరు మీరే సెలెక్టు చేసి ఉంచండి. ఇంకా చాలా వ్రాయాలని ఉంది. కానీ, బాబు నిద్రలేచి ఏడుపు మొదలెట్టాడు.

కాబట్టి ఇంతటితో ముగిస్తున్నాను. జవాబుకోసం ఎదురుచూస్తూ ఉంటాను.

మీ వీణ.

## 2

గుడివాడ,
9—5—66.

శ్రీవారికి నమస్కారములు

మీరు వెళ్లాక క్షేమంగా చేరు కున్నా ననయినా ఉత్తరం వ్రాయ లేదు. ఇక్కడంతా క్షేమం. బాబు మీకోసం వెదుకుతున్నాడు. ఇక అసలు విషయం. నేను మొన్ననే డాక్టర్ మెర్సీ దగ్గరకు వెళ్లి పరీక్ష చేయించుకున్నాను. మూడవ నెల అని చెప్పింది. చాలా బలహీనంగా ఉన్నానని చెప్పింది. టానిక్కులు వ్రాసి ఇచ్చింది. పళ్ల రసాలూ పాలూ, తాగమంది. ఇంజక్షన్లు ఒక కోర్సు ఇస్తానంది. ఏమిటో! మళ్లీ ఇంత తొందర్లో సంతానం అంటే విసుగ్గా ఉందికదూ! మొన్ననే బాబుకు స్వల్పంగా జ్వరం వచ్చింది. మందు ఇప్పించగానే తగ్గింది. ప్రస్తుతం కోలుకుంటున్నాడు. పోలమ్మ పనికి సరిగ్గా వస్తూందా? అన్నట్టు నేను వచ్చేటప్పుడు పెరట్లో చీర ఉతికి ఆరేశాను. ఉందో, ఎవరు కొట్టేశారో! ఉన్నట్లయితే తీసుకొచ్చి ఇంట్లో పెట్టండి. వేళకు భోజనం అవీ సరిగ్గా అమరుతున్నాయా? లేకపోతే కొన్నాళ్లపాటు అత్తయ్యని పిలిపించండి. సౌకర్యంగా ఉంటుంది. ఇప్పటికింతే. జవాబు వ్రాస్తారని ఆశిస్తాను.

నమస్కృతులతో,
—మీ వీణ.

కాకినాడ,
12—5—66.

ప్రియమైన వీణకు,

నేను ఇన్నాళ్ళూ క్యాంపులో ఉండటం వలన నీ ఉత్తరాన్ని ఆలస్యంగా అందుకున్నాను. నిన్ననే కాంపునుండి వచ్చాను. ఇల్లంతా దుమ్ముకొట్టుకుని ఉంది. పోలమ్మ చేత శుభ్రం చేయించాను. ఇంకో విశేషం. ఏమిటంటే నేను కాంపుకి వెళ్లేటప్పుడు కుక్క ఒకటి ఇంట్లో దూరి ఉంటుంది. నేను దాన్ని చూసుకోకుండా తాళం వేసుకొని వెళ్లిపోయాను. నేను వెళ్లిపోయాక అది ఏడ్చి, రకరకాలుగా మొరిగి, తలుపులు గీరి గొడవ చేసిందట. పక్కవాళ్లు చెప్పారు. నేను వచ్చి తలుపు తాళం తీయగానే భల్లూకంలా బయటకు దూకింది. నేను దిమ్మరపోయి చూస్తూ ఉండిపోయాను. పాపం! ఇన్నాళ్ళూ జైల్లో ఉన్నట్టుందేమో! శరవేగంతో రోడ్డుమీదికి పారిపోయింది. ఇక ఇంటి నెలా తయారు చేసిందో, అదంతా వ్రాయకపోవడమే మంచిది. మొత్తానికి ఇల్లిప్పుడు శుభ్రంగానే ఉంది. మా అమ్మను పిలుచుకోమని వ్రాశావు. ఈ కొద్ది రోజులకూ ఆవిన్నెందుకు బాధపెట్టడమని ఊరుకున్నాను. హోటలు భోజనం బాగాలేనందున నేనే రేపట్నుండి వండుకోవాలని నిశ్చయించుకున్నాను. నువ్వుమాత్రం ఆరోగ్యం జాగ్రత్తగా చూచుకోవలసింది. జీతం అందగానే డబ్బు కొంత పంపుతూ ఉంటాను. పళ్లూ అవీ కొని వాడుతూ ఉండు. బాబు గాడికి నా ముద్దులు. ప్రత్యుత్తరం వ్రాయగలవు.

ఇట్లు,
భాను.

గుడివాడ,
16—5—66.

నమస్కారములు,

మీ శునకోపాఖ్యానం చదివి చాలా నవ్వాను. మీ రెప్పుడూ ఇంతే. పరిసరాల మీద అసలు ధ్యాస ఉంచుకోరు. ఆ వంట ఎలా చేసుకుంటారో ఏమో! ఆవకాయ జాడీలో చేతులు పెట్టడం లాంటి పనులు చెయ్యకండి. పొడి తెడ్డుతో జాగ్రత్తగా తీసి చిన్న జాడీలో వేసుకుని వాడుకోండి. లేకపోతే సంవత్సర మంతా ఉండవలసిన ఆవకాయ నిష్కారణంగా పాడయిపోతుంది. వంటింట్లోని పెద్ద అలమారు — రెండో అరలో — కుడి పక్కన పెద్ద గాజు జాడీలో కంది పొడి ఉంది. గ్లాక్సో డబ్బాలో గుమ్మడికాయ వడియాలు ఉన్నాయి. తీసి వాడుకోండి. అన్నం అత్తెసరు పెట్టుకుంటే సరి. వార్చి చేతులమీద వేసుకోవలసిన అవసరం ఉండదు. ఎలా చేస్తున్నారో ఏమో. అన్ని సంగతులూ వ్రాయండి. పనిమనిషికి మన ఇంటి గిన్నెల్లో అన్నం అవీ పెట్టి ఇవ్వకండి. అదసలే దొంగముండ. మీరుచూస్తే పరధ్యానం ప్రొఫెసరుగారు. మన పొరుగింటి పైడమ్మా, ఎదురింటి అచ్చమ్మా బావున్నారా? నా గురించి అడుగుతున్నారా? బాబు నాన్నగారేరీ అని అడుగుతున్నాడు? జవాబు వ్రాయవలసింది.

ఇట్లు,
వీణ.

---

### నరకం

సద్గుణాలకు స్వర్గమే ఉంటుందంటే అపరాధాలకు నరకం కూడా ఉండి ఉండాలి.

—కాసిన్

### నిజాయితీ

నిజాయితీకంటె విలువైన వారసత్వ సంపద మరొకటి లేదు.

—షేక్స్పియర్

---

కాకినాడ,
22—5—66.

చి. సౌ. వీణకు,

ఆశీస్సులు. నీ ఉత్తరం అందింది. ఆవకాయలూ, వడియాలూ నేను వాడడం లేదు. నీవు వచ్చే వరకూ అవి భద్రంగానే ఉంటాయి. నాకు వంట రాదనుకున్నా వేమిటి? అన్నం శుభ్రంగా వండుకుంటున్నాను. తల వెంట్రుకలూ, రాళ్లూ లేకుండా! చక్కగా అమ్లెట్లూ, రోస్టులూ చేసుకుంటున్నాను. భోజనం వండర్‌ఫుల్‌గా ఉంటూంది. అప్పుడప్పుడూ పైడమ్మా, అచ్చమ్మా చక్కటి, చిక్కటి పులుసులూ గట్రా పంపుతున్నారు. నీ గురించి అడిగారు. ఇప్పుడప్పుడే రావని చెప్పాను. ఇంతే సంగతులు. బాబుకి నా ముద్దు లందజెయ్యవలసింది. జవాబు జరూరు.

ఇట్లు,
భానుమూర్తి.

తా. క. నీ ఆరోగ్యం ఎలా ఉన్నదీ వ్రాయి. మందులూ అవీ వాడుతున్నావా?

భానుమూర్తి.

గుడివాడ,
24—5—66.

పూజ్యులైన శ్రీవారికి,

అనేకనమస్కారములు. నా ఆరోగ్యం గురించి చాలా ఆందోళన వెలిబుచ్చారు. సంతోషం. నేను రాయిలా ఉన్నాను. మందులూ అవీ బాగా ఎక్కిస్తున్నాను. కడుపునిండా మెక్కుతున్నాను. అచ్చమ్మ పైడమ్మా చిక్కటి పులుసులు పంపుతున్నారా? ఉత్త పులుసులేనా, ఇంకా ఏమైనా పంపుతున్నారా? అమ్లెట్లూ, రోస్టులూ వండుకుంటున్నానని వ్రాశారు. ఎప్పుడు పుట్టింటికి పోతానా అని చూశారు కాబోలు! చికెన్ బిర్యానీ వదిలేశా రెందుకు? అది కూడా పూర్తిచెయ్యండి. వంట ఇల్లు పవిత్రమై పోతుంది. చాకలి గంగమ్మ బట్టలు సరిగ్గా ఉతికి తెస్తూందా? అసలు పద్దు రాస్తున్నారా లేదా? నాకు ఎంత త్వరగా అక్కడికి బయలుదేరి వచ్చేస్తానా అని ఉంది. కొంచెం ఒంట్లో వెసులుబాటు చిక్కగానే బయలుదేరివస్తాను. జవాబు వ్రాయండి.

వీణ.

కాకినాడ,
30—5—66.

సౌభాగ్యవతి వీణకు,

ఆశీర్వచనములు. ఉభయకుశలోపరి. నీవు వ్రాసిన ఉత్తరం అందింది. ఇక్కడకు రావడానికి తొందరపడుతూ వ్రాశావు! నే నంటే ఎంత శ్రద్ధ నీకు? నీవు తొందరపడి నీ ఆరోగ్యాన్ని అలక్ష్యంచేసి ఇక్కడికి రావద్దు. ఇక్కడికి వస్తే నీకు మళ్లీ విశ్రాంతి ఉండదు. నిజమే — నువ్వన్నట్టు చికెన్ మరిచిపోయాను. దండకారణ్యం కాంపుల్లో ఉన్నప్పుడు మా స్టాఫ్ అంతా ఎప్పుడూ అవే తినే వాళ్లం. పల్లెవాళ్లు మహా రుచిగా వండే వాళ్లనుకో. గంగమ్మ రెగ్యులర్‌గా *బట్టలు* ఉతికితెస్తూంది. పోలమ్మకు ఒంట్లో బాగాలేదట. కూతుర్ని పంపుతూంది పనిలోకి. పదహారేళ్లు ఉంటాయి. పేరు అప్పచ్చిట. నిజంగా అప్పచ్చిలాగే చక్కగా ఉంది. పని చురుగ్గా చేస్తూంది. నా గురించి నువ్వు విచారించకు. కారమ్సుకీ, పేకాటకీ ఫ్రెండ్సు ఇంటికే వస్తున్నారు. కాబట్టి కాలం బాగా గడిచిపోతూంది. నువ్వు తొందరపడి బయలుదేరి రావద్దు. నీ ఆరోగ్యం ముఖ్యం. బాబు సంగతులు వ్రాశావు కాదు. వాడికి నా ముద్దు లందజెయ్యి. ఉంటాను.

ఇట్లు,
భానుమూర్తి.

గుడివాడ,
1—6—66.

శ్రీవారికి,

రేపు ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి వస్తున్నాను తమ్ముడితో. స్టేషనుకు రండి. వచ్చేముందు నాన్నగారిచేత వైరిప్పిస్తాను.

వీణ. ★